# ఇప్పట్లో కొత్త బస్సులు లేనట్టే..!

## మరో ఆరు నెలల తర్వాతే బస్సులు.. అప్పటి వరకు పాత బస్సులతో సరిపెట్టనున్న ఆర్టీసీ



- మహాలక్ష్మి పథకంతో ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు..
- సిటీ బస్సులుగా మారనున్న 600 జిల్లా మెట్రో లగ్జరీ సర్వీసులు
- స్క్రాప్‌కు సిద్ధంగా ఉన్న 1100 సిటీ సర్వీసులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్‌కు ఇప్పట్లో కొత్త బస్సులు వచ్చే అవకాశం కనిపించడం లేదు. మహాలక్ష్మి పథకం అమలుతో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం నగరంలో ఉన్న సిటీ బస్సులు సరిపోవడం లేదు. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు కొత్త బస్సులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం గుర్తించింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన సర్కారు కేవలం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చి చేతులు దులుపుకున్నది. కాని, ఆ పథకాన్ని ఏ విధంగా అమలు చేయాలి? అమలు చేయడానికి ఉన్న సమస్యలేమిటీ? అమలులో భాగంగా ఎదురయ్యే సమస్యలు ఏ విధంగా అధిగమించాలి? అధిక ప్రయాణికుల నేపథ్యంలో.. తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రస్తుతం 3500 బస్సులు అవసరం..

ప్రస్తుతం నగరంలో మహాలక్ష్మి పథకం కోసం 3500 సిటీ బస్సులు అవసరం. కానీ, ప్రస్తుతం అందుబాటులో ఉన్నవి 2650 మాత్రమే. వాటిలో దాదాపు 300 వరకు అద్దె బస్సులు, 1000 మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు పోగా.. మిగిలినవి ఆర్డినరీలు. అదనంగా 900 బస్సులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలుస్తోంది. కొత్త బస్సులు తీసుకొస్తే.. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల నియామకాలు కూడా చేయాల్సిన పరిస్థితులున్నాయి. ఉచిత బస్సు పథకం ఆర్టీసీకి తలకు మించిన భారంగా మారిందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### 600 బస్సులు రిప్లేస్..

మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంలో అవసరమైన కొత్త బస్సులు ఇప్పట్లో నగరానికి వచ్చే అవకాశం లేదు. ఈ లోగా మహాలక్ష్మి పథకాన్ని ఏ విధంగా అమలు చేయాలి అన్న ఆలోచనలో అధికారులు తలమునకలయ్యారు. నగరంలో 15 సంవత్సరాలు నిండి, కాలం చెల్లిన బస్సులు దాదాపు 1100 పైగా ఉన్నాయి. వీటినే నగరంలోని అన్ని మార్గాల్లో తిప్పుతుండగా.. కాలుష్యం విపరీతంగా వస్తున్నది. వాటిని త్వరలోనే స్క్రాప్‌కు పంపించనున్నారు. ఈ క్రమంలో 600 సిటీ బస్సులను రిప్లేస్ చేయబోతున్నారు. ఇందుకు జిల్లాలో తిరుగుతున్న దాదాపు 600 సూపర్ లగ్జరీ బస్సులను నగరంలో నడిపించాలని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. దాదాపు ఎనిమిది, తొమ్మిది సంవత్సరాలు తిరిగిన బస్సులను నగరానికి తీసుకురానున్నారు. ఆ బస్సులను సిటీ బస్సులకు అనుగుణంగా మార్పులు చేస్తారు. వచ్చే జూన్ లేదా జూలై నాటికి 500 విద్యుత్ బస్సులను కొత్తగా తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు.



రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీ బాయిపూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో వెనకబడిన తరగతుల జాతీయ కమిటీ చైర్మన్ ఎం.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ధర్నాకు మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్‌తో పాటు పలువురు బీసీ సంఘాల నేతలు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కమిటీ నేతలు కే.అచ్చయ్య, శ్రీనివాస్, వి. దాణకర్ణాచారి, చిన్నయ్య, మంజులత, అంబిక, రమేశ్, సువర్ణ, పద్మాగౌడ్, లక్ష్మీబాయి, రవికుమార్, ప్రదీప్, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

- కవాడిగూడ, ఫిబ్రవరి 7




### రెయిన్‌బో హాస్పిటల్‌లో బటర్ ఫ్లై ఎసెన్షియల్స్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి7 : పీడియాట్రిక్స్, అబ్స్టెట్రిక్స్, గైనకాలజీ సేవల్లో రెండు దశాబ్దాలుగా రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ గ్రూప్ దేశం లోనే అగ్రగామిగా నిలవడంతో పాటు సురక్షితమైన ప్రాడక్ట్స్‌ను ప్రవేశపెట్టామని హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ రమేశ్ కంచర్ల తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో హాస్పిటల్‌లో బటర్ ఫ్లై ఎసెన్షియల్స్ పేరుతో ప్రవేశపెట్టిన ఉత్పత్తుల లోగోను, స్టోర్‌ను సినీ నటుడు అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి ఆవిష్కరించారు. చైల్డ్ అండ్ వుమెన్ కేర్ ప్రొడక్ట్స్‌తో కూడిన ఈ ఉత్పత్తులు ఆర్గానిక్ పదార్థాలతో తయారు చేయబడ్డాయని యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.



ప్రముఖ కవి కళ్లెం నవీన్ రెడ్డి రాసిన 'యోధ' కవిత్వ పుస్తకాన్ని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హరీశ్ రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ)



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్, రైల్వే ఉన్నతాధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాట్ ఫామ్ నంబర్ 1, 10లో నిర్మిస్తున్న మల్టీ లెవల్ కారు పార్కింగ్ భవన నిర్మాణ పనులు, పలు అభివృద్ధి పనుల వివరాలను రైల్వే జీఎంను అడిగి తెలుసుకున్నారు. ఎయిర్‌పోర్టు తరహాలో సకల సౌకర్యాలతో సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం 26 లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

- మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 7



చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరుగుతున్న సకల కళా సప్తాహంలో భాగంగా ప్రముఖ రచయిత, కవి రఘుశ్రీ రచించిన కవీంద్ర మోక్షం హిందీ కవితా సంపుటిని బుధవారం పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోపాలకృష్ణ, రఘుశ్రీ, కామేశ్వరరావు, బాలగంగాధరయ్య పాల్గొన్నారు.

- ముషీరాబాద్, ఫిబ్రవరి 7

### బీఈడీ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 7: ఓయూ పరిధిలోని బీఈడీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మొదటి, రెండో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని, ఓయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

### జాతీయ డాక్టోరల్ కాంక్లేవ్ వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న రెండో జాతీయ డాక్టోరల్ కాంక్లేవ్‌ను వాయిదా వేసినట్లు చైర్మన్ ప్రొఫెసర్ చెన్నప్ప, కన్వీనర్ ప్రొఫెసర్ గడ్డం నరేశ్‌రెడ్డి తెలిపారు. అనివార్య కారణాల రీత్యా వాయిదా వేశామని, తిరిగి కాంక్లేవ్‌ను వచ్చే నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.

### ఓయూ తరహాలో ఉచిత వైద్య సేవలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): ప్రజాసేవ చేయడంలో సీఎంఆర్ గ్రూప్స్ ఎల్లప్పుడు ముందుంటుందని మల్లారెడ్డి హాస్పిటల్స్ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతిరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే నిరుపేద రోగుల ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో ప్రభుత్వ దవాఖానలకు సమాంతరంగా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ భద్రారెడ్డి, విశ్వేశ్వరశాస్త్రి, డాక్టర్ సుధారమణి, డాక్టర్ రమణితో కలిసి ప్రీతిరెడ్డి ఉచిత వైద్య సేవల గురించి వివరించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజాసేవలో భాగంగానే ఈ ఉచిత వైద్యసేవలు అందిస్తున్నామని, 14ఏండ్లుగా కుత్బుల్లాపూర్, సూరారంలోని మల్లారెడ్డి హాస్పిటల్‌లో పైసా ఖర్చు లేకుండా రోగులకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు.

### సైంటిస్టులకు సీసీఎంబీలో శిక్షణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ) : ల్యాబొరేటరీ సైంటిస్టులకు, రీసెర్చ్ స్కాలర్లకు పరిశోధన నైపుణ్యాలు, డేటా అనాలసిస్, గ్రాంట్ రిపోర్టుల తయారీపై అవగాహన కల్పించేలా ఎంబో సొల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో సీసీఎంబీలో నాలుగు రోజుల వర్క్ షాప్ నిర్వహించనున్నారు. ఈ ఏడాది నవంబర్ 11నుంచి 14, నవంబర్ 18 నుంచి 21 మధ్య జరిగే శిక్షణ తరగతులకు హాజరయ్యేందుకు ఏప్రిల్ 1లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారి జాబితాను మే 30న విడుదల చేయనున్నారు.

### అప్పులు తీర్చలేక..

వెంగళరావునగర్, ఫిబ్రవరి 7 : బిడ్డ పెండ్లి కోసం చేసిన అప్పులు తీర్చలేక ఓ తండ్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రహ్మత్‌నగర్‌లో జరిగింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా నడికూర్‌కు చెందిన రవుతు శ్రీనివాస్ (42) తన కుటుంబంతో కలిసి రహ్మత్‌నగర్‌లో ఉంటూ తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఇద్దరు కూతుళ్లు. మూడేండ్ల క్రితం పెద్ద కూతురు పెండ్లి కోసం రూ.6 లక్షలు అప్పు చేశాడు. అప్పులు తీర్చే ఆర్థిక స్తోమత లేదనే దిగులుతో మద్యం తాగేవాడు. ఊరిలో ఉన్న ఇల్లు అమ్మేద్దాం.. దిగులు పడకు అంటూ భార్య శశికళ భర్తకు ధైర్యం చెప్పి ఇంటిని అమ్మేందుకు ఊరెళ్లింది. కాగా రెండు రోజుల నుంచి ఫోన్ చేస్తుంటే.. భర్త ఫోన్ ఎత్తక పోవడంతో ఇంటి యజమానికి ఫోన్ చేసి విషయం చెప్పింది. అతడు వెళ్లి పిలిచినా పలకకపోవడంతో, లోపలినుంచి గడియ పెట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా.. ఫ్యాన్‌కు వేలాడుతూ శ్రీనివాస్ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య శశికళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐల బదిలీలు..

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 7: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇచ్చారు. 17 మంది ఇన్‌స్పెక్టర్లు, 17 మంది ఎస్‌ఐలకు బదిలీ చేస్తూ సీపీ సుధీర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు.




ఎన్‌సీసీ గేటు ఎదుట రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు

## స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి

- ఓయూలో ఏబీవీపీ రాస్తారోకో

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 7: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు ఎదుట రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఆల్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు కలిపి రాష్ట్రంలో రూ.10వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరితో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆరోపించారు. రాస్తారోకో చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## విజయోత్సవ సభలు గ్రాండ్ సక్సెస్

నియోజకవర్గ బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగాలతో రెట్టింపు ఉత్సాహం

మేడ్చల్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించిన నియోజకవర్గ విజయోత్సవ సభలు సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తున్నది. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో జరిగిన సభలకు అనుకున్నదాని కంటే బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు వేలాది సంఖ్యలో తరలివచ్చి గ్రాండ్ సక్సెస్ చేశారు. దీనికితోడు సభలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై ఆయన చేసిన ప్రసంగాలు ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులకు రెట్టింపు ఉత్సాహాన్నిచ్చింది. త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్ సభ స్థానంలో బీఆర్‌ఎస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందన్న అంచనాలు ప్రజల్లో ఏర్పడ్డాయి.కాగా, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లోనూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉండటంతో కలిసి వస్తుందని భావిస్తున్నారు.

### ఆరు గ్యారెంటీలు అమలు కాకపోతే పోరాటమే..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే ప్రజల తరపున పోరాటం బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ప్రసంగానికి ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణుల నుంచి విశేష స్పందన వచ్చింది. 60 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్న విషయాన్ని స్వయంగా సభలకు వచ్చిన ప్రజలు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలంటూ మహిళలు సభల్లో నినాదాలు చేశారు. మహాలక్ష్మి పథకం కింద అత్తాకోడళ్లకు ఇవ్వాలని, దరఖాస్తులు చేసుకున్న వారందరికి లబ్ధి చేకూరేవరకు పోరాడుదామని మహిళలకు కేటీఆర్ భరోసానిచ్చారు. కేటీఆర్‌తో సెల్ఫీలు దిగేందుకు యువకులు ఉత్సాహం చూపించారు. సభలను ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ. వివేకానంద్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయడంలో భాగస్వాములయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు నిర్వహించిన విజయోత్సవ సభలు బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపి, ఎన్నికలకు సన్నద్ధం చేసినట్లయింది.

## స్టాన్లీ మత్తు సామ్రాజ్యం

- గోవా కేంద్రంగా దేశ, విదేశాలకు సరఫరా
- అమెరికాలో పండే ఓజీ పదార్థం విక్రయం
- దేశంలోని సినీ, రాజకీయ ప్రముఖులతోనూ లింకులు..?

ఖైరతాబాద్, ఫిబ్రవరి 7: డ్రగ్స్ పెడ్లర్ స్టాన్లీ అంతర్జాతీయంగా మత్తు సామ్రాజ్యాన్నే స్థాపించాడు. మంగళవారం టీఎస్ న్యాబ్, హెచ్‌న్యూ, పంజాగుట్ట పోలీసులు స్టాన్లీని అరెస్టు చేసి.. రూ.8 కోట్ల విలువజేసే మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అతడి వ్యక్తిగత జీవితంతో పాటు నేర సామ్రాజ్య విస్తరణపై పోలీసుల దర్యాప్తులో అనేక విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నైజీరియాకు చెందిన 43 ఏండ్ల ఇవులా ఉకోడా స్టాన్లీ 2009లో భారత్‌లో అడుగు పెట్టాడు. ముంబైలో జూవెల్ అనే వ్యక్తి సాయంతో రెడీమేడ్ బట్టల వ్యాపారాన్ని ప్రారంభించి, అక్కడి నుంచి గోవాలోని కండోలిమ్‌కు చేరుకున్నాడు. తోటి నైజీరియన్లను పరిచయం చేసుకొని డ్రగ్స్ దందాను నేర్చుకున్నాడు. తొలుత గోవాకు వచ్చే పర్యాటకులు, సందర్శకులకు డ్రగ్స్‌ను విక్రయించడం ప్రారంభించాడు. గత 15 ఏండ్ల కాలంలో మత్తు పదార్థాల విక్రయం, సరఫరా చేస్తూ దేశ, విదేశాలకు తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించాడు.

### 2012 లోనే జైలుకు..

బిజినెస్ వీసాపై వచ్చి గోవాలోనే మకాం పెట్టిన అతడిని 2012లో గోవాలోని మపూజా పోలీసులు అరెస్టు చేశారు. జైలు నుంచి విడుదలైన తర్వాత అతడికి రాజస్థాన్‌కు చెందిన ఉషా చండేల్ అనే మహిళతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో ఆమెను 2014లో పెండ్లి చేసుకున్నాడు. ఇద్దరు కలిసి చిన్న కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. డ్రగ్స్ వ్యాపారం చేసే ఇద్దరు నైజీరియన్లు స్టాన్లీ దుకాణం వద్దకు నిత్యం రావడంతో వారితో పరిచయం పెరిగి చివరకు డ్రగ్స్ వ్యాపారంలో భాగస్వామిగా మారాడు. వినియోగదారులకు డ్రగ్స్ సరఫరా చేసే స్థాయి నుంచి సొంతంగా పలువురు ట్యాక్సీ డ్రైవర్లు, ట్రాన్స్‌పోర్టర్ల సాయంతో డ్రగ్స్ కొనుగోలు, విక్రయాల దందా ప్రారంభించాడు. 2017లో డ్రగ్స్ పెడలింగ్ చేస్తున్న స్టాన్లీని గోవా ఎన్‌సీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆ కేసులో సెంట్రల్ జైలుకు వెళ్లాడు. విడుదలైన తర్వాత దేశంలోనే.. విదేశాలకు కూడా డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభించాడు.

### విలాసవంతమైన భవనం.. కారు

స్టాన్లీ వ్యక్తిగత జీవితం చూసి పోలీసులు విస్తుపోయారు. స్టాన్లీకి గోవాలోని కండోలిమ్‌లో విలాసవంతమైన భవనంతో పాటు కోట్లాది రూపాయల విలువైన కారు, ఇతర వస్తువులు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం భార్యా పిల్లలతో కలిసి అక్కడే ఉంటున్నాడు. స్థానికులకు ఓ సామాన్య గ్రోసరీ వ్యాపారిగా కనిపించే స్టాన్లీ.. అంతర్జాతీయ స్థాయిలో డ్రగ్స్ దందా చేస్తూ వందల కోట్లు సంపాదించాడని చెబుతున్నారు.

### ఓజీ.. ఖరీదైన డ్రగ్..

స్టాన్లీ వద్ద స్వాధీనం చేసుకున్న రూ.8 కోట్ల విలువైన మత్తు పదార్థాలలో ఓజీ వీడ్ అత్యంత ఖరీదైన డ్రగ్ అని పోలీసులు తెలిపారు. ఈ ఓజీ మత్తు పదార్థం అమెరికాలో మాత్రమే సాగవుతుందని తెలిపారు. గంజాయి జాతికి చెందిన ఈ మత్తు పదార్థం ఒక్క గ్రాము ధర రూ. ఐదువేలకు పలుకుతుందని పోలీసులు తెలిపారు. దీనిని ఎక్కువగా సినీ, రాజకీయ ప్రముఖులు వినియోగిస్తారని సమాచారం. స్టాన్లీ కస్టమర్లను గుర్తించేందుకు పోలీసులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.

### ముగిసిన మెగా హెల్త్ క్యాంప్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల కోసం 15 రోజులుగా చేపట్టిన మెగా హెల్త్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. ఈ హెల్త్ క్యాంపులో 1022 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని సీపీ అవినాష్ మహంతి అభినందించారు.

### ట్రాన్స్ జెండర్ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

జూబ్లీహిల్స్ , ఫిబ్రవరి 7: ట్రాన్స్ జెండర్ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు జడ్జి జస్టిస్ పి.సామ్ కోషి పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్స్ సమస్యలపై పోలీసులు, ప్రభుత్వ అధికారులు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలతో సమావేశం నిర్వహించి ట్రాన్స్ జెండర్స్ హక్కులపై పలు సూచనలు చేశారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాణి కుముదిని, డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

## నిమ్స్‌లో జర్మనీ భాష శిక్షణ తరగతులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 7 : నిమ్స్ దవాఖానలో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ఆధ్వర్యంలో జర్మనీ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. నర్సుల కోసం ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాణి కుమూదిని, డైరెక్టర్ డాక్టర్ బీరప్పతో కలిసి బుధవారం ప్రారంభించారు. విదేశీ విద్యా, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జర్మనీలోని ఆస్పత్రుల్లో అవకాశాలు ఉంటాయని, భారత కరెన్సీతో పోల్చుకుంటే నెలకు రూ.83వేల నుంచి రూ.2,05,000 వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టామ్ కామ్ ప్రత్యేక కార్యదర్శి, సీఈవో డాక్టర్ ఇ.విష్ణు రెడ్డి, నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, డాక్టర్ తాడూరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెంగళరావునగర్, ఫిబ్రవరి 7: ఎస్‌ఆర్ నగర్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మరణించాడు. ఇన్‌స్పెక్టర్ సతీష్ కథనం ప్రకారం.. నిర్మల్ పట్టణానికి చెందిన సిరిపురం నిఖిల్(21) ఎస్‌ఆర్ నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి ఎర్రగడ్డలో ఉంటున్న మిత్రుడిని కలిసేందుకు మరో మిత్రుడు అనిల్‌కు చెందిన ద్విచక్ర వాహనం తీసుకుని వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వేగంగా వస్తూ.. బాపూనగర్‌లో ఓ కారును ఓవర్ టేక్ చేయబోయాడు. దీంతో వాహనం అదుపుతప్పి కారుకు ఢీకొట్టి కిందపడిపోయాడు. హెల్మెట్ కూడా ధరించలేదు. తలకు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

### గృహజ్యోతికి వివరాల సేకరణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): ఉచిత విద్యుత్ పథకానికి అర్హులైన వారిని గుర్తించేందుకు విద్యుత్ శాఖ యంత్రాంగం క్షేత్రస్థాయిలో నిమగ్నమైంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నుంచి మొదలుకొని డైరెక్టర్లు, సీజీఎంలు, సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్లు మీటర్ రీడర్లతో కలిసి పర్యటిస్తున్నారు. స్పాట్ బిల్లింగ్ యంత్రాల్లో గృహ జ్యోతి పథకం కింద అర్హులైన వారి వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ నెల 15 లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నారు. గ్రేటర్‌లోని 9 సర్కిళ్ల పరిధిలో సూపరింటెండింగ్ ఇంజినీర్లు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారుల వివరాలను మీటర్ రీడింగ్ సిబ్బందితో కలిసి తీసుకుంటున్నారు. ఇదే అంశంపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల నుంచే ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలన్న పట్టుదలతో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు.

### జేఎన్‌టీయూ రెక్టార్‌గా ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీ మెకానిక్ డిపార్టుమెంట్‌కు చెందిన ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డిని యూనివర్సిటీ రెక్టార్‌గా నియమిస్తూ బుధవారం అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు తీసుకున్నారు. యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ డీవీ నరసింహారెడ్డిని నియమించారు. అలాగే మెకానికల్ విభాగానికి చెందిన డాక్టర్ ఏ.అరుణకుమారిని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిగా, డాక్టర్ ఎస్ తారాకల్యాణిని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అఫిలియేషన్ విభాగానికి ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా, అకడమిక్ ఆడిట్ సెల్‌కు డైరెక్టర్‌గా నియమిస్తూ యూనివర్సిటీ వీసీ నిర్ణయం తీసుకున్నారు.